క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా

మన్ననూర్: స్థానిక గిరిజన కో–ఆపరేటివ్ సంస్థలో ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తూ అర్ధాంతరంగా మృతి చెందిన వారికి సంస్థ పరంగా వచ్చిన ఎక్స్‌గ్రేషియాను ఆ సంస్థ డివిజనల్ మేనేజర్ ప్రతాప్‌రెడ్డి మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. జీసీసీ పని చేసిన ఉద్యోగులు కృష్ణయ్య, కన్నయ్య, వెంకటయ్య మృతి చెందారన్నారు. ఈ క్రమంలో జీఓ 101 ప్రకారం రూ: 3.10 లక్షలు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ సంతోష్‌కుమార్, అకౌంటెంట్ జయరాజ్, సిబ్బంది సాయిబాబ, శ్రీనివాసులు, దూద్యానాయక్, రమణ, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ ప్రతుల దహనం

అచ్చంపేట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ యువతతోపాటు నిరుద్యోగులను నిరాశపరిచిందని వైఎఫ్ఐ రాష్ట్ర సభ్యుడు వర్దం సైదులు అన్నారు. పట్టణంలోని ఎల్ఆర్ఎం ఐటీఐ కళాశాల ఆవరణలో మంగళవారం బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో మహేష్, అనీల్‌యాదవ్, రవి, సురేష్, నికేతన్ ఉన్నారు.

సామాజిక సేవలకు అవార్డు

కల్వకుర్తిరూరల్: స్వామి వివేకానంద సేవా బృందాన్ని స్థాపించి పదేళ్లుగా సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు సమాజంలో ప్రజలను చైతన్యవంతం చేసే కార్యక్రమాలు నిర్వహించిన బృందం అధ్యక్షుడు శివకుమార్‌కు ఉమ్మడి జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు లభించింది. ఈ మేరకు మంగళవారం మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్ ఆయనకు జిల్లా స్థాయి ఉత్తమ సేవారంగ సంస్థ అవార్డును అందజేశారు.

నూతన కమిటీ ఎన్నిక

కల్వకుర్తిరూరల్: క్లాస్‌మేట్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాఘవేందర్, కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా రాజేందర్‌లను ఎన్నుకున్నారు. క్లాస్‌మేట్ క్లబ్ రాష్ట్ర కార్యదర్శి కల్మిచర్ల రమేశ్, శోభన్‌బాబు, లక్ష్మీనరసింహారావు, నర్సిరెడ్డి, శ్రీధర్, కృష్ణయ్య, అశోక్, రమేశ్, వెంకటేశ్వర్లు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లులేని పేదలను ఆదుకోవాలి

అచ్చంపేటరూరల్: పట్టణంలో నివసిస్తున్న పేదలందరికి డబుల్‌బెడ్రూం, ఇళ్ల స్థలాలు ఉన్న వారికి రూ.5లక్షల ఆర్థిక సాయం అందించాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి శంకర్‌నాయక్, సీఐటీయూ జిల్లా నాయకులు మల్లేష్ డిమాండ్ చేశారు. సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి ఆర్‌డీఓ పాండునాయక్‌కు వినతి పత్రం అందజేశారు.

ఆహ్వాన పత్రం అందజేత

తాడూరు: మండల కేంద్రంలోని స్థానిక శివాలయ ఆవరణలో శివస్వాముల ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 18 వరకు జరిగే శివపార్వతుల బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని మంగళవారం ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డికి శివస్వాములు ఆహ్వానపత్రికను అందజేశారు. 5 రోజుల పాటు ప్రత్యేకంగా నిర్వహిస్తున్నామని శివస్వాములు సాంబశివుడు, వెంకట్రాములు తదితరులు తెలిపారు.

ఇంటింటి ప్రచారం

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని కుడికిల్లలో టీపీసీసీ సభ్యుడు చింతలపల్లి జగదీశ్వరావు హాత్ సే హాత్ యాత్రలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అంతకు ముందు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మినిగె రాముడు, నాయకులు ఉన్నారు.

సామూహిక వివాహాల పత్రికల పంపిణీ

తాడూరు: ఈనెల 12న ఎంజేఆర్ ట్రస్టు అధినేత స్థానిక ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే సామూహిక వివాహాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను మండల కేంద్రంలో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు యార రమేశ్, మాజీ సర్పంచ్ మశన్న, అనుపటి శ్రీనివాసులు, ఖాసీం, చింత సత్తి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

వెల్దండ: బీఆర్ఎస్‌కి కార్యకర్తలే పట్టుకొమ్మలని, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోలి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నారాయణపూర్‌లోని ఆయన నివాసంలో కల్వకుర్తి, జూపల్లిలకు చెందిన వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అంజినాయక్, శ్రీనివాసులు, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, సుభాష్, రూపం వెంకట్‌రెడ్డి, నాగులునాయక్, శంకర్‌నాయక్ తదితరులు ఉన్నారు.

సేవలను విస్తృతం చేయాలి

కల్వకుర్తిరూరల్: వాసవీక్లబ్ ద్వార అందిస్తున్న సేవలకు విస్తృత పరచాలని వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ గాయత్రి కోరారు. మంగళవారం వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ రామకృష్ణ, క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసులు హైదరాబాద్‌లో ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ గాయత్రి, కార్యదర్శి రామకృష్ణలను కలిశారు.

మెరుగైన వైద్యమే ప్రభుత్వ లక్ష్యం

వెల్దండ: ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొట్రలో పల్లె దఖావాన నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వ పల్లె దవాఖానలను ఏర్పాటు చేస్తుందన్నారు. ఒక్కొక్క భవన నిర్మాణానికి రూ.20లక్షల నిధులను మంజూరు చేసిందన్నారు. మండలంలోని కొట్ర, బొల్లంపల్లి, కుప్పగండ్ల, బైరాపూర్ గ్రామాల్లో పల్లె దవాఖానలను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో 37 మంజూరైనట్లు వివరించారు.

పేదలకు ఎంతో మేలు..

రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో పేదప్రజల సంక్షేమానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఎన్నడు లేనివిదంగా రూ.2లక్షల 93వేల కోట్ల బడ్జెట్ వైద్యం, విద్య, వ్యవసాయ రంగాల అభివృద్ధికి అధిక ప్రాధన్యత ఇచ్చిందన్నారు. అనంతరం కొట్ర, నాగురావుపల్లితండాలలో సీసీరోడ్డు పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పోనుగోటి వెంకటేశ్వర్‌రావు, ఉపసర్పంచ్ పద్మ, వైస్‌ఎంపీపీ శాంతి, ఎంపీటీసీ రాములు, నాయకులు జైపాల్‌నాయక్, గోపాల్‌నాయక్, భాస్కర్‌రావు, శ్రీనునాయక్, రవికుమార్‌గౌడ్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మోహన్‌లాల్, ఏఈ బాల్‌రాజ్, ఎంపీఓ సునీత, కార్యదర్శి బాలస్వామి ఉన్నారు.



కల్వకుర్తిలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

రూ.2 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

కల్వకుర్తి: మున్సిపాలిటీ పరిధిలో రూ.2 కోట్లతో చేపట్టే సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మంగళవారం శంకుస్థాపన చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని 2, 3, 7, 8, 10, 19 వార్డుల పరిధిలో రూ.2 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేకంగా మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులను మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, వైస్ చైర్మన్ షాహెద్, మాజీ చైర్మన్ శ్రీశైలం, కౌన్సిలర్లు సూర్యప్రకాశ్‌రావు, శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాసులు, బాలునాయక్, యజాస్ పాల్గొన్నారు.

మినీ ట్యాంక్‌బండ్ పనుల పరిశీలన

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని చుకాయపల్లి ఊర చెరువు కట్టపై నిర్మాణం చేస్తున్న మినీ ట్యాంక్ బండ్ పనులను మంగళవారం ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు త్వరగా నాణ్యతగా చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం గ్రామంలో రూ.35లక్షల వ్యయంతో నూతనంగా సీసీ రోడ్డు, రూ.5 లక్షల నిధుల వ్యయంతో డ్రెయినేజీ నిర్మాణ పనులకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం శివాలయం ఆవరణలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బోరు మోటరును ప్రారంభించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



సీసీరోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి

పశువైద్య శిబిరం ప్రారంభం

పెంట్లవెల్లి: మండల పరిధిలోని కొండూరులో పునరావృతి వైద్య శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవాలకు సకాలంలో టీకాలు వేయించాలని, అప్పుడే పశువులు, గొర్రెలు, మేకలు ఆరోగ్యంగా ధృడంగా ఉంటాయని జిల్లా పశువైద్యాధికారి సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి రమేష్, ఏడీ ఆదిత్యవర్మ, డా.యాదగిరి, ఉపసర్పంచ్ విష్ణువర్ధన్, సిబ్బంది శివప్రసాద్, వెంకటేష్, శివరాములు, వెంకటేష్ పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న జిల్లా వైద్యాధికారి రమేష్

శివస్వాములకు అన్నప్రసాదం, వసతి



అన్నప్రసాదం వితరణ చేస్తున్న నిర్వాహకులు

కందనూలు: జిల్లా కేంద్ర సమీపంలోని కొల్లాపూర్ చౌరస్తా వద్ద గల శ్రీజ్ఞాన సరస్వతి దేవాలయ ఆవరణలో మంగళవారం కాలినడకన, వాహనాలలో శ్రీశైలం వెళ్లే శివస్వాములకు మధ్యాహ్నం అన్నప్రసాద పంపిణీ చేసినట్లు ఆలయ ప్రధాన కార్యదర్శి ఎలిమే ఈశ్వరయ్య, మహిళా కార్యదర్శి దొడ్ల ఇందుమతి మంగళవారం తెలిపారు. మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని శివదీక్ష మాల స్వీకరించిన శివ స్వాములు అన్న ప్రసాదం, పండ్ల పంపిణీ, రాత్రి వేళలో బస చేయుటకు వసతి, నీటి వసతిని వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో దొడ్ల నారాయణరెడ్డి, భూపాల్ రెడ్డి, శివశంకర్, మాధవి, రవికుమార్, లలిత, భక్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

కందనూలు: వాసవీ క్లబ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఆకారపు ఓంకార్ జన్మదినాన్ని పురస్కరించుకొని శ్రీపురం సీపీఎస్ విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ పూర్వ అధ్యక్షుడు గంధం ప్రసాద్ మాట్లాడుతూ శ్రీపురం స్కూల్‌కు పూర్వం సరస్వతి విగ్రహం, జిరాక్స్ మిషన్, విద్యార్థులకు మొదట ఇంగ్లిష్ మీడియం స్కూల్ ప్రారంభించి షూ, డిక్షనరీలు ఎన్నో రకాల కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు చిగుళ్లపల్లి రమణ కుమార్, కోశాధికారి పోల రవికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య సేవలు అందించాలి

కోడేరు: ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని ఎంపీపీ కొండ వెంకటరాధ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సమయ పాలన ప్రకారం సిబ్బంది విధులకు హాజరయ్యేలా చూడాలని డాక్టర్ దశరథంకు సూచించారు. కార్యక్రమంలో కొండ సుధాకర్‌రెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

దర్గాలో ప్రార్థనలు

కల్వకుర్తి: సమాజంలోని ప్రతి ఒక్కరు కులమతాలకు అతీతంగా భక్తిభావంతో మెలగాలని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కల్వకుర్తి మండలం జీడిపల్లిలో దర్గాలో పూల చాదర్ సమర్పించి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సుంకిరెడ్డి వరప్రసాద్ రెడ్డి, శంకరయ్య, వెంకటయ్య, కృష్ణారెడ్డి, శ్రీపతిరాజు, గణేశ్, హసన్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పును అనుసరించాలి

దోమలపెంట(అచ్చంపేట): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును కేంద్ర ప్రభుత్వం అనుసరించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య అన్నారు. మంగళవారం ఆయన శ్రీశైలంకు వెళ్తూ వటువర్లపల్లిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీధర్‌రావు, వటువర్లపల్లి అంబేద్కర్ సంఘం నాయకులు ప్రభాకర్, భరత్, జానకిరాములు, శ్యామ్, చెన్నకేశవులు, సుమన్, అఖిల్, కాశయ్య, బలరాం, మన్యాలు పాల్గొన్నారు.

దళిత, గిరిజనుల ఉద్యోగులకు అన్యాయం

పెంట్లవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో దళిత, గిరిజనుల నిరుద్యోగులకు పూర్తిగా అన్యాయం జరిగిందని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్‌చంద్ర అన్నారు. 2018లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీజేవైఎం నాయకులు అన్నారు. ఇప్పటికైనా హామీలు నెరవేర్చి ఓట్లు అడగడానికి రావాలని ఆయన తెలియజేశారు.

క్రీడాకారులకు దుస్తుల అందజేత

కల్వకుర్తిరూరల్: ప్రతి క్రీడాకారుడు క్రీడా స్ఫూర్తితో వ్యవహరించాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి చంద్రకాంత్‌రెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని జీడిపల్లిలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించడంతో పాటు క్రీడాకారులకు దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపోటములను సమానంగా స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, మహెమూద్, అంజి, రామకృష్ణ, కిష్టారెడ్డి పాల్గొన్నారు.



క్రీడాకారులకు దుస్తులను అందజేస్తున్న చంద్రకాంత్‌రెడ్డి

క్షుద్ర పూజలపై కఠిన చర్యలు తీసుకోవాలి

కోడేరు: మండల కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మాడల్ స్కూల్ గేట్ ఎదుట క్షుద్రపూజలు చేసి విద్యార్థులు, ఉపాధ్యాయులను భయాందోళనకు గురి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాడల్ స్కూల్, హాస్టల్ దగ్గర వాచ్‌మెన్ లేకపోవడంతో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వాచ్‌మెన్లను ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా బాలికల హాస్టల్ దూరంగా ఉండటంతో రాత్రి వేళలో గుర్తు తెలియని వ్యక్తులు మద్యం సేవించడానికి కాంపౌండ్‌లోకి వస్తున్నారని అన్నారు. వెంటనే సీసీ కెమెరాలను, పెట్రోలింగ్ నిర్వహించి భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజేష్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 3న పెద్దకొత్తపల్లి మండలం చంద్రకల్‌కి చెందిన వెంకట్‌స్వామి తన కుమారుడితో కలిసి జిల్లా కేంద్రంలోని డీటీఓ కార్యాలయంలో ద్విచక్ర వాహనం రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వచ్చారు. అనంతరం తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా దేశిటిక్యాల వద్ద ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొనడంతో వెంకట్ స్వామికి తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండటంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఎమ్మెల్యేకు వినతి

అచ్చంపేటరూరల్: వీఆర్ఏల పేస్కేల్‌పై అసెంబ్లీలో ప్రస్తావించాలని కోరుతూ వీఆర్ఏల జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీఆర్ఏల డివిజన్ జేఏసీ చైర్మన్ పరమేష్, శోభారాణి, వెంకటయ్య, సాజిత్ తదితరులు ఉన్నారు.

ఘనంగా కల్యాణోత్సవం

కోడేరు: మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో రెండు రోజుల పాటు వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సత్యనారాయణస్వామి వ్రతం, కల్యాణోత్సవం, మహా మంగళహారతి, పల్లకీసేవ, తదితర పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు రాఘవేంద్రశర్మ తెలిపారు. అనంతరం అన్నదానం చేసినట్లు ఆయన తెలిపారు.

నర్సరీల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ



యాదిరెడ్డిపల్లిలో నర్సరీలను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఈఓ భాగ్యలక్ష్మీ

తాడూరు: నర్సరీల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని డిప్యూటీ సీఈఓ భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు యాదిరెడ్డిపల్లిలోని నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె నర్సరీ నిర్వాహకులకు ఎండలు ప్రారంభమవుతున్నందున మొక్కలు ఎండిపోకుండా ప్రతి రోజు నీటిని అందించాలన్నారు. మొక్కలు నాటే సమయానికి అన్ని రకాల మొక్కలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అదే విధంగా నర్సరీ చుట్టూ గ్రీన్ మ్యాట్ తప్పనిసరి ఉంచాలన్నారు. ప్రతి మొక్కను తెలంగాణకు హరితహారంలో భాగంగా ఉపయోగపడేలా చూడాలన్నారు. అనంతరం గ్రామంలోని పారిశుద్ధ్యంతో పాటు గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించి సర్పంచ్ ప్రవీణ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సునీతను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీఓ గంగమోహన్, ఆంజనేయులు, శ్రావణ్ ఉన్నారు.

‘సమానత్వం’ షార్ట్‌ఫిల్మ్ ప్రారంభం

తెలకపల్లి: మండల కేంద్రంలోని విమల్ కేర్ వెల్ క్లినిక్ ఆధ్వర్యంలో మంగళవారం సమానత్వం షార్ట్ ఫిల్మ్ ప్రారంభించినట్లు నిర్వాహకులు డాక్టర్ వైవీ చలం తెలిపారు. ఇందులో నటీనటులు పద్మాలయ ఆచార్య గడ్డం మల్లిఖార్జున్, కథ మాటలు, దర్శకత్వం యాదవల్లి నాగరాజు, రమేశ్, అశోక్, కృష్ణయ్య, రమేశ్ నాయక్ నటించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో గడ్డం మల్లికార్జున్, టీచర్ పర్వతాలు, ఉపసర్పంచ్ కృష్ణయ్య, సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, హెడ్‌కానిస్టేబుల్ నారాయణ, మాజీ ఉపసర్పంచ్ ఎం బాలగౌడ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



షార్ట్ ఫిల్మ్ ప్రారంభిస్తున్న నిర్వాహకులు

జర్నలిస్టుల సంక్షేమానికి సహకారం

కొల్లాపూర్: జర్నలిస్టు సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రంలోని జర్నలిస్టులకు ఇండ్లస్థలాలను కేటాయిస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. ఇందుకు సంభందించిన ప్రొసిడింగ్ పత్రాలను మంగళవారం జిల్లా కేంద్రంలో నియోజకవర్గ జర్నలిస్టులకు ప్రెస్ అకాడమీ చైర్మెన్ అల్లం నారాయణతో కలిసి ఆయన అందజేశారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి

కల్వకుర్తిరూరల్: జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్ అన్నారు. మంగళవారం మండలంలోని జీడిపల్లి గ్రామ అంగన్‌వాడీ కంపౌండ్ నిర్మాణానికి రూ.5లక్షల నిధులు మంజూరు చేసి ప్రొసీడింగ్‌ను సర్పంచ్ కల్పనకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్ నిధుల నుంచి జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల పరిధిలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అందరి సహకారంతో జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు శంకర్ నాయక్, ఉపసర్పంచ్ ఖాజ, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.



ప్రొసీడింగ్ అందిస్తున్న బాలాజీ సింగ్

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: పెద్దకొత్తపల్లి మండలంలోని చిన్నకొత్తపల్లిలో రజక వృత్తిని నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్న తిప్పరాజు తిరుపతమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి కొట్ర నవీన్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తిప్పరాజు తిరుపతమ్మ ఇస్త్రీ చేస్తుండగా ఉచిత మీటర్ ద్వార షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి కాలిపోయాయని, దాదాపు రూ.లక్ష వరకు నష్టం జరిగిందన్నారు. ప్రభుత్వం విచారణ జరిపించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు విద్యుత్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

రమాబాయికి నివాళి

కల్వకుర్తిరూరల్: అంబేద్కర్ సతీమణి రమాబాయి జయంతిని మంగళవారం పట్టణంలోని సుభాష్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు రావుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం పాట

కల్వకుర్తిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా నాటు సారా, నల్ల బెల్లం తరలిస్తూ పట్టుబడిన వాహనాలను బుధవారం ఎక్సైజ్ కార్యాలయ ఆవరణలో వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ శంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పారిశుద్ధ్య చర్యలు

మన్ననూర్: శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారి చెరువుకొమ్ము లింగమయ్య సమీపంలోని దుర్వాసుల చెరువు, మృగవాణి రెస్టారెంట్ పరిసర ప్రాంతాల్లో ఉన్న చెత్త చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను రైతులు, గ్రామస్తులతో కలిసి ఐసీఐసీఐ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో తొలగించారు. అటవీచెక్‌పోస్టు వద్ద ఉన్న హోటళ్ల నిర్వాహకులకు చెత్త వేసుకునేందుకు చెత్త బుట్టలను పంపిణీ చేశారు. ఫౌండేషన్ పెసిలిటేటర్ అంతయ్య రైతులు లింగయ్య, సురేష్, చంద్రయ్య, వెంకటయ్య, అంజి హాతీరాం, కృష్ణయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న ‘కంటి వెలుగు’

కల్వకుర్తిరూరల్: కంటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టింది. రఘుపతిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మొత్తం 509 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 88 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు.

తాడూరు: మండలంలోని ఐతోల్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు పరీక్షా కేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుధాకర్‌లాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం అంధత్వ నివారణ కోసం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మండలంలో ప్రస్తుతం తాడూరుతో పాటు ఐతోల్‌లో పరీక్ష కేంద్రాల్లో నిర్వహిస్తున్నారన్నారు. వైద్య సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి ప్రభుత్వం అమలు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతమయ్యేలా పనిచేస్తున్నారన్నారు. ఆయన వెంట వైద్యాధికారి డాక్టర్ సంతోష్‌అభిరాం, ఇస్మాయిల్, వైద్య సిబ్బంది హైమావతి, శ్రీనివాసులు, దాసు, కళావతి పాల్గొన్నారు.



కంటి పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుధాకర్‌లాల్